27 నుంచి ఎఐటియుసి రాష్ట్ర మహాసభ

- యాదగిరి గుట్టలో మూడు రోజులపాటు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) రాష్ట్ర మహాసభలు యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరి గుట్టలో ఆదివారం ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు కొనసాగే ఈ మహాసభను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఎస్ బోస్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ... మహాసభ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు యాదగిరి గుట్టలో పది వేల మందితో మహా ప్రదర్శన నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్‌తోపాటు పలువురు రాష్ట్ర నేతలు పాల్గొంటారని చెప్పారు. 28న ప్రతినిధుల సభ ప్రారంభమవుతుందని వివరించారు. ఆ తర్వాత కార్యదర్శి నివేదికపై చర్చలు కొనసాగుతాయని వెల్లడించారు. మహాసభలో కార్మికులకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలపై మొత్తం 40 తీర్మానాలను ప్రవేశపెడతామని చెప్పారు. విలేకర్ల సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ బాలరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షులు ఎమ్‌డి యూసుఫ్, నాయకులు పి ప్రేంపావని తదితరులు పాల్గొన్నారు.

బోయింగ్‌కు 'ఆజాద్' విడి భాగాల డెలివరీ

హైదరాబాద్ : ఏరోస్పేస్, క్లీన్ ఎనర్జీ, డిఫెన్స్, ఆయిల్ అండ్ గ్యాస్ తదితర ఇంజినీర్డ్ కాంప్లెక్స్ ప్రెసిషన్ విడిభాగాల తయారీ సంస్థ ఆజాద్ ఇంజినీరింగ్ నేషనల్ ఏరోస్పేస్ స్టాండర్డ్ (ఎన్ఎఎస్) విడిభాగాల తొలి కన్‌సైన్‌మెంటును అంతర్జాతీయ విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు అందజేసింది. 2021సెప్టెంబరులో తమ సంస్థ పొందిన కాంట్రాక్టులో ఇది ఒక భాగమని ఆజాద్ ఇంజనీరింగ్ తెలిపింది. "మా కోసం నేషనల్ ఏరోస్పేస్ స్టాండర్డ్ పార్టుల మొదటి కన్‌సైన్‌మెంట్ పూర్తి చేసినందుకు ఆజాద్ ఇంజనీరింగ్ సంస్థను మేము అభినందిస్తున్నాం. ఇది కంపెనీ ప్రపంచ స్థాయి ఉత్పాదక సామర్థ్యానికి మరో నిదర్శనం." అని బోయింగ్ ఇండియా సప్లై చైన్ సీనియర్ డైరెక్టర్ అశ్వనీ భార్గవ తెలిపారు. "వేగవంతమైన ప్రణాళిక, కఠినమైన ఉత్పత్తి, స్మార్ట్ సప్లై-చైన్ నిర్వహణ ప్రత్యక్ష ఫలితమే ఈ పురోగతి. ఇందులో పాల్గొన్న ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో చేసిన కషిని నేను అభినందిస్తున్నాను." అని ఆజాద్ ఇంజినీరింగ్ వ్యవస్థాపకుడు, ఎండి రాకేష్ చోప్దార్ పేర్కొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి బిజెపి అడ్డంకి

- కేంద్రం ఆంక్షలతో రూ.40 వేల కోట్ల ఆదాయానికి గండి
- రాష్ట్ర ప్రజానీకానికి అంతా తెలియజేయాలి
- డిసెంబర్‌లో అసెంబ్లీ సమావేశాలు : సిఎం కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అభ్యుదయ పథంలో నడుస్తున్న తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డంకిగా మారిందని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. కేంద్ర అనాలోచిత, అనవసర ఆంక్షల వల్ల 2022 -23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయంలో రూ.40 వేల కోట్లు గండిపడిందని చెప్పారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపుతుందని, అన్ని విషయాలను రాష్ట్ర ప్రజలకు తెలియజేసేందుకు డిసెంబర్‌లో వారం రోజులపాటు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని సిఎం నిర్ణయించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు, శాసన సభ వ్యవహారాల మంత్రి ప్రశాంత్ రెడ్డిని సిఎం కెసిఆర్ గురువారం ఆదేశించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆదాయ వ్యయాలపై ఆర్థిక శాఖ అధికారులతో సిఎం చర్చించిన అనంతరం గురువారం సిఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అసంబద్ధ ఆర్థిక విధానాలను అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరి, రాష్ట్రాల భవిష్యత్తుకు, ప్రగతికి ఆటంకంగా మారిందని అన్నారు. ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు ప్రతి రాష్ట్రానికి ఆనవాయితీగా ఎఫ్ఆర్‌బిఎం పరిమితులను ముందస్తుగా కేంద్రం వెల్లడిస్తుందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే తెలంగాణకు ఇచ్చే ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని రూ.54 వేల కోట్లుగా కేంద్రం ప్రకటించిందని తెలిపారు. దీనిని అనుసరించి తెలంగాణ రాష్ట్రం బడ్జెట్‌ను రూపొందించుకుందన్నారు. కేంద్రం అకస్మాత్తుగా తెలంగాణ రాష్ట్ర ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని రూ.39 వేల కోట్లకు కుదించడంతో రాష్ట్రానికి అందాల్సిన రూ.15 వేల కోట్ల నిధులు తగ్గాయని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆర్థికంగా పటిష్టంగా ఉన్న రాష్ట్రాలకు అదనంగా 0.5 శాతం నిధుల సేకరణకు ఎఫ్ఆర్‌బిఎం పరిమితి ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఈ సౌలభ్యాన్ని పొందనీయకుండా విద్యుత్ సంస్కరణలు అమలు చేస్తామంటేనే 0.5 శాతం రుణ పరిమితికి అనుమతిస్తామని కేంద్రం మెలికపెట్టిందన్నారు. దాంతో సుమారు 6 వేల కోట్ల రూపాయలను రాష్ట్రం కోల్పోయిందని, రాష్ట్రానికి రావాల్సిన రూ.20 వేల కోట్ల బడ్జెటేతర నిధులు కూడా రాకుండా కేంద్రం నిలిపివేయించిందని తెలిపారు. కేంద్రం అనాలోచిత విధానాలు, పూర్తి ఆర్థిక అజ్ఞానంతో కూడిన నిర్ణయాలతో తెలంగాణ రాష్ట్రానికి దాదాపు 40 వేల కోట్లకుపైగా నిధులు రాకుండా పోయాయని సిఎం వెల్లడించారు.

ఆర్థిక సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల ప్రకారం నిధులు రాకుండా కేంద్రం నిలిపివేయించిందని సిఎం తెలిపారు. ఆయా సంస్థలతో ప్రభుత్వాధికారులు నిరంతరం సంప్రదింపులు జరపడంతో గతంలో చేసుకున్న ఒప్పందాల మేరకు నిధులను ఈ మధ్యకాలంలో విడుదల చేస్తున్నాయన్నారు. అనతికాలంలోనే అన్ని రంగాల్లో అత్యద్భుత ప్రగతితో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ ప్రతిభను పలచన చేయాలనే కుట్రపూరిత వైఖరితో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని స్పష్టమవుతుందని అన్నారు. కేంద్రం తన ఇష్టానుసారంగా అనుసరిస్తున్న నిర్ణయాల వల్ల సమయానుకూలంగా నిధులు అందక అభివృద్ధి ఆగిపోయి రాష్ట్రాల ప్రగతి కుంటుపడే పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాలు దేశాభివృద్ధికే గొడ్డలిపెట్టుగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. రాజకీయ ప్రేరేపితమైన కక్షపూరిత దిగజారుడు విధానాలతో దేశంలోని అన్ని రాష్ట్రాల గొంతును కోస్తూ, నష్టపరుస్తూ, కేంద్రం సమాఖ్యస్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నదని కెసిఆర్ పేర్కొన్నారు.

ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను పటిష్టం చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పటిష్టం చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ద్వితీయ మహాసభను గురువారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ రియింబర్స్‌మెంట్ కోతలతో నెలల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇపిఎస్ పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇచ్చేందుకు కనికరం చూపించటం లేదని అన్నారు. కార్పొరేట్లకు, పారిశ్రామికవేత్తలకు మాత్రం కోట్లాది రూపాయలు బ్యాంకు రుణాలను మాఫీ చేయడానికి చేతులు వస్తున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లోని రిటైర్మెంట్ ఉద్యోగులు సామాజిక పింఛన్‌కన్నా తక్కువ పెన్షన్‌తో బతుకుతున్నారని చెప్పారు.

జిల్లా పరిషత్ చైర్మెన్ దాదన్నగారి విట్టల్‌రావు మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లకు ఆర్‌టిసి ప్రయాణాల్లో రాయితీ కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేలో గతంలో ఉన్న రాయితీని కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ట్రెజరీ అధికారి బి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. ఆల్ పెన్షనర్స్ రాష్ట్ర అధ్యక్షులు పాలకుర్తి కృష్ణమూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చ రంగయ్య మాట్లాడుతూ.. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్‌లో పాత పింఛన్ విధానం అమలుకు పూనుకున్నాయని, తెలంగాణ ప్రభుత్వమూ అమలు చేయాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇపిఎస్ పెన్షనర్ల హక్కుల సాధన కోసం ఢిల్లీలో డిసెంబర్ 7, 8 తేదీల్లో ధర్నాకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. అనంతరం గుర్రాల సరోజనమ్మను ఘనంగా సన్మానించారు. దత్తాద్రిరావు అధ్యక్షత వహించిన ఈ మహాసభలో కె రామ్మోహన్‌రావు, ముత్తారం నరసింహస్వామి, ఎస్.ప్రసాద్‌రావు, సుదర్శన్‌రాజ్, శిర్ప హనుమాన్లు, భోజరావు, అందే సాయిలు పాల్గొన్నారు.



న్యాయవాదులతో సమావేశమైన మంత్రి హరీశ్‌రావు తదితరులు

అన్ని హంగులతో సబ్ కోర్టు ఏర్పాటుకు కృషి

- గజ్వేల్ న్యాయవాదులకు మంత్రి హరీశ్‌రావు హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గజ్వేల్ పట్టణంలో న్యాయవాదులు కోరినట్టు సబ్ కోర్టు ఏర్పాటు చేసి అందులో అన్ని హంగులను సమకూర్చుతామని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. హైదరాబాద్‌లో గురువారం మంత్రి హరీశ్‌రావు, తెలంగాణ ఫారెస్ట్ చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ శ్రీనివాస్‌తో న్యాయవాదులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గజ్వేల్‌లో సబ్ కోర్టుకు ఏర్పాటుకు ఆదేశాలు ఇవ్వాలని న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి ఫోన్ ద్వారా వివరించారు. ఆదిలాబాద్‌లో ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొంటున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ఒకటి, రెండు రోజుల్లో గజ్వేల్ సబ్ కోర్టు సంబంధించిన ఉత్తర్వులు ఇస్తారని హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని, న్యాయపరంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పార్థసారథి రాజు, కాశీ ప్రసాద్, అశోక్ రెడ్డి, వనం భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గజ్వేల్‌ను జిల్లా చేయండి

గజ్వేల్‌ను జిల్లాగా ఏర్పాటు చేస్తే న్యాయస్థానంతో పాటు అన్ని కార్యాలయాలు సమకూరుతాయని గజ్వేల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పార్థసారథిరాజు అన్నారు. మంత్రి హరీశ్‌రావును కలిసే ముందు ఎఫ్‌డీసీ చైర్మెన్ వంటేరు ప్రతాపరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ మాదాసు శ్రీనివాస్‌తో ఆయన చర్చించారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకుపోవాలని కోరారు. జిల్లా కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రభుత్వ కార్యాలయాన్నీ తరలి వస్తాయన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీశ్ రావు, ఎంపి కొత్త ప్రభాకర్ రెడ్డి దీనికోసం కృషి చేయాలని కోరారు.

విజిలెన్స్ నివేదికను బహిర్గతం చేయాలి

- సిపిఎం నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ డిమాండ్
- పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై చర్యలు తీసుకోవాలని, విజిలెన్స్ నివేదికను బహిర్గతం చేయాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి గురువారం మెయిల్ ద్వారా వినతి పత్రం పంపించారు. పిఆర్‌సి సందర్భంగా రాష్ట్రంలోని 194 మోడల్ స్కూల్స్ టీచర్స్ నుంచి అక్రమంగా భారీ మొత్తంలో డబ్బు వసూలు చేశారని, గూగుల్ పే, ఫోన్‌పే ద్వారా ఆఫీసు సూపరింటెండెంట్ కుటుంబ సభ్యుల ఖాతాల్లో వేసినట్టు టీచర్స్ బహిరంగంగా చెబుతున్నారని లేఖలో పేర్కొన్నారు. డిప్యూటేషన్‌ల కోసం భారీ మొత్తంలో వసూలు చేశారని, వీటిపై మీడియాలో కథనాలూ వచ్చాయని గుర్తుచేశారు. అడిషనల్ డైరెక్టర్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని, అయినా నేటికీ సంబంధిత అధికారులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. విజిలెన్స్ శాఖ ఇచ్చిన నివేదికపై చర్యలు తీసుకోవాలని, నివేదికను బహిర్గతం చేయాలని, అవినీతి నిరోధానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



సాధికారితపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

మహిళలకు రక్షణ కరువు

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా సాధికారితపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నవంబర్ 25 అంతర్జాతీయ హింస వ్యతిరేక దినం నుంచి డిసెంబర్ పది మానవ హక్కుల దినోత్సవం వరకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా సాధికారితపై విద్యాసంస్థల్లో అవగాహనా సదస్సులు, సెమినార్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశంలో నిత్యం ఏదో ఒకచోట ప్రతి నిమిషం మహిళలు దాడులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు విద్యతో పాటు ఉపాధి రంగంలోనూ అగ్రభాగాన నిలుస్తూ సమాజాభివృద్ధిలో అన్నిరంగాల్లో ముందుంటున్నప్పటికీ ఇంకా వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా ప్రాధాన్యత ఇచ్చినప్పుడే మహిళ సాధికారిక సాధ్యమవుతుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలకు ఆహార భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ప్రతి విద్యా సంస్థలో ర్యాగింగ్ వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థలతో పాటు, మహిళలు పని చేసే చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమలత, జయమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, ఐద్వా మండల ఉపాధ్యక్షులు ఎల్లమ్మ, మండల కార్యదర్శి మస్కు అరుణ, పాఠశాల టీచర్స్ జయశ్రీ, అమృత, సిబ్బంది పాల్గొన్నారు.

జనవరి15 లోపు లబ్ధిదారుల ఎంపిక

- 'డబుల్'పై అధికారులకు మంత్రి వేముల ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పూర్తయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం లబ్దిదారుల ఎంపికను జనవరి 15 లోపు పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. వాటి నిర్మాణ పనుల పురోగతి, లబ్దిదారుల ఎంపిక తదితర అంశాలపై గురువారం హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, హౌసింగ్ స్పెషల్ సెక్రెటరీ సునీల్ శర్మతో కలిసి మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. మంత్రి వేముల మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ మానస పుత్రిక అయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పథకంలో అర్హులైన లబ్దిదారులకు ఇళ్లు అందేలా చూడాలని కోరారు. బిపిఎల్ కుటుంబాలు, ఫుడ్ సెక్యూరిటీ కార్డులు, అద్దె ఇళ్లలో ఉన్న వారి జాబితాను ఎంపిక చేసి గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని సూచించారు. తుది జాబితాను సంబంధిత ప్రజాప్రతినిధుల ఆమోదంతో హైదరాబాద్‌లోని టిఎస్‌టిఎస్‌కు పంపాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలో మొత్తం రెండు లక్షల 91 వేల డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని వివరించారు. హైదరాబాద్ మినహా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లక్షా 29 వేల ఇండ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలైన విద్యుత్, సీవరేజ్, రహదారుల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని కోరారు. ఇళ్లను లబ్దిదారులకు కేటాయించడంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తుది దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు.

రైతులకిచ్చిన హామీలను అమలుపరచాలి

- సంయుక్త కిసాన్ మోర్చా ఆదివాసీ అడవి హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ
- 26న చలో రాజ్‌భవన్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలుపరచాలని సంయుక్త కిసాన్ మోర్చా, ఆదివాసీ అడవి హక్కుల పరిరక్షణ సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని విద్యానగర్ మార్క్స్ భవన్‌లో రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆదివాసీ, రైతు సంఘాల నాయకులు వేములపల్లి వెంకటరామయ్య, సాగర్, పశ్య పద్మ మాట్లాడారు. మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసపూరిత వైఖరి అవలంబిసోందని అన్నారు. మూడు కార్పొరేట్ అనుకూల వ్యవసాయ చట్టాలను విరమింపజేయాలని ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సంవత్సరానికిపైగా చారిత్రాత్మక ఉద్యమం చేసి మహత్తర విజయాన్ని సాధించామన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకుంటామని, ఉద్యమ నాయకులపై కేసులు ఎత్తివేయడంతోపాటు ఉద్యమం సమయంలో చనిపోయిన రైతుల కుటుంబాలకు నష్టపరిహారం తదితర డిమాండ్లు పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ద్రోహానికి పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక చర్యల వల్ల ఏటా 15 వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. రైతుల ఆత్మహత్యలను నివారించాలని, ఏకకాలంలో రుణమాఫీ చేసి రుణ విమోచన చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు రూ. ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరారు. అలాగే, గిరిజనులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములపై కనీస హక్కులను కాలరాస్తున్న అడవి సంరక్షణ చట్టం 2022ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అడవి సంరక్షణ నియమాలు ఉపసంహరణ కోసం ఈ నెల 26న చలో రాజభవన్‌కు పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు, ఆదివాసీ సంఘాల నాయకులు కెచ్చల రంగయ్య, అంజయ్య నాయక్, రాయల చంద్రశేఖర్, శ్రీరామ్ నాయక్, మండల వెంకన్న, ప్రసాద్ అన్న, వస్కుల మట్టయ్య, బి గోపాల్, బాలమల్లేశ్ పాల్గొన్నారు.

శిల్పా లేఅవుట్ ఫ్లైవంతెన నేడు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరంలో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం విరివిగా ఫ్లైఓవర్లు నిర్మిస్తుంది. హైదరాబాద్ నగరం నుంచి ఔటర్‌పైకి చేరుకోవడానికి వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ కష్టాలకు తెరదించేందుకు బల్దియా కొత్త ఫ్లైఓవర్‌ను అందుబాటులోకి తెచ్చింది. గచ్చిబౌలి ఒఆర్‌ఆర్ నుంచి శిల్పా లేఅవుట్ వరకు రూ.190 కోట్లతో చేపట్టిన నాలుగు వరుసల ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయింది. 823 మీటర్ల పొడవు, 16.60 మీటర్ల వెడల్పుతో నిర్మితమైన ఇది పొడవైన ఫ్లైవంతెనల్లో ఒకటిగా నిలవనుంది. అద్దాల, భారీ భవంతుల నడుమ ఈ వంతెన కొత్త అందాలను సంతరించుకుంది. దీన్ని శుక్రవారం ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ ప్రారంభించనున్నారు.

బిసిల రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలి

- రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి జనగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం వారికి 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ రిజర్వేషన్లనూ పెరిగిన జనాభాకనుగుణంగా పెంచాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహా ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు, విద్యార్థి, కుల సంఘాల నాయకులు, మేధావులు, ప్రొఫెసర్లు తమ వెంట నడవాలని పిలుపునిచ్చారు. 1932 తర్వాత ఇప్పటివరకు బిసి కులగణన ఎందుకు చేయలేదో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. బిసి కులగణన చేయాలనీ, దేశంలోని ఉన్నత న్యాయస్థానాల్లోనూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసి క్రీమీలేయర్ విధానం ఎత్తివేయాలన్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు వాటా కల్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాల్లో బిసిల కోసం 8,617 టీచింగ్ పోస్టుల భర్తీకి అనుమతి ఉన్నా.. ఉద్దేశపూర్వకంగా 4,821 పోస్టులను ఖాళీగా ఉంచారని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి బిసిల పట్ల చిత్తశుద్ధి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దయానందరావు, రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ అక్బర్, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ ముదిరాజ్, పార్టీ అధికార ప్రతినిధులు సాంబశివ గౌడ్, అరుణ క్వీన్, డా వెంకటేష్ చౌహాన్ పాల్గొన్నారు.

'పది'ంతలు వసూలు

- టెన్త్ పరీక్ష ఫీజు రూ.125 కాగా..
- ప్రయివేటులో వసూలు చేసింది రూ.వెయ్యి
- కంప్యూటర్, ఇతర ఖర్చుల కోసమంటూ బుకాయింపు
- రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తంతు
- పరీక్ష ఫీజు పేరుతో ముక్కుపిండి బకాయిల వసూళ్లు
- ప్రభుత్వ పాఠశాలల్లోనూ కొన్ని చోట్ల రూ. 200 తీసుకున్న వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి పరీక్ష ఫీజును ప్రయివేటులో పదింతలు వసూలు చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. కంప్యూటర్, ఇతర ఖర్చులు ఉంటాయని బుకాయిస్తున్నారు. అసలు పరీక్ష ఫీజు రూ.125 ఉంటే దానికి బదులు ఫీజు రూ.900, పాస్‌ఫొటోలకు మరో రూ.100 తీసుకురావాలని చెప్పారు. ఇదేంటని ప్రశ్నిస్తే మాత్రం ప్రతియేడూ ఫీజు ఇంతే ఉంటుందని, అదీ తెలియదా? అంటూ తల్లిదండ్రులకు ఎదురు ప్రశ్నలు ఎదురయ్యాయి. అయితే, కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో రూ. వెయ్యి వరకు వసూలు చేస్తే.. బడ్జెట్ స్కూళ్లలో రూ.500 నుంచి రూ.700 మధ్య వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఇదే క్రమంలో రెగ్యులర్ ఫీజు కడితేనే పరీక్ష ఫీజు తీసుకుంటామని బెదిరించి మరీ బకాయిలన్నీ ముక్కుపిండి వసూలు చేస్తున్నట్టు సమాచారం. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి నడుస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లోనూ కొన్ని చోట్ల ఒక్కో విద్యార్థి నుంచి రూ.200 వరకు వసూలు చేసినట్టు సమాచారం.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల యజమానులు, ప్రభుత్వ పాఠశాలల సిబ్బంది ఏ చిన్న అవకాశం వచ్చినా తమకు అనుకూలంగా మార్చుకుంటున్న పరిస్థితి. గతేడాది పదో తరగతి పరీక్ష ఫీజును రెండింతలు వసూలు చేసిన సర్కారు స్కూళ్ల పరిస్థితిపై పత్రికలు రాసిన కథనానికి అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ ఈ ఏడాదీ కొన్ని ప్రభుత్వ పాఠశాలలు తీరు మార్చుకోకుండా టెన్త్ ఎగ్జామ్ ఫీజు రూ.125 ఉంటే రూ.200 వరకు వసూలు చేశాయి. ఇదే సమయంలో ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలూ పదోతరగతి పరీక్ష ఫీజు తీసుకునే సందర్భాన్ని స్కూల్ ఫీజు వసూళ్లకు వినియోగించుకున్నాయి.

సరైన సమాధానం చెప్పకుండా...

సాధారణంగా ప్రయివేటు పాఠశాలల్లో సాధారణ ఫీజులో రాయితీలు అడిగే విద్యార్థుల తల్లిదండ్రులు పదోతరగతి పరీక్ష ఫీజుపై పెద్దగా దృష్టిపెట్టడం లేదు. రూ.వేలు, రూ.లక్షల్లో ఫీజులు కడుతున్న కొంత మంది తల్లిదండ్రులు పరీక్ష ఫీజు రూ.700 నుంచి రూ.వెయ్యి అడిగినా పెద్దగా పట్టించుకోకుండానే చెల్లిస్తున్నారు. అయితే, పరీక్ష ఫీజుపై అవగాహన ఉన్న కొంతమంది తల్లిదండ్రులు మాత్రం పదింతల ఫీజు ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తే అధికారుల పేరు చెప్పి జారుకుంటున్న పరిస్థితి. నవంబర్ మొదటి వారం నుంచే బకాయిలన్నీ కడితేనే పదోతరగతి పరీక్ష ఫీజు తీసుకుంటామని, ఈ విషయం తల్లిదండ్రులకు ఫోన్లు, వాట్సప్ మెసేజ్‌ల ద్వారా సమాచారాన్ని అందించినట్టు తెలుస్తోంది. పరీక్ష ఫీజు కింద రూ.900, పాస్‌ఫొటోలకు రూ.100 తీసుకురావాలని హకుం జారీ చేశారు. కొన్ని పాఠశాలలు పరీక్ష ఫీజు రూ.500 నుంచి రూ.700వరకు ఇవ్వాలని సూచించారు. ఇలా కేవలం పదోతరగతి పరీక్ష ఫీజు వసూళ్ల పేరుతోనే ఒక్కో కార్పొరేట్ స్థాయి ప్రయివేటు పాఠశాలలు రూ.లక్షల్లో దండుకున్నాయి.



ఆదేశాలు బేఖాతరు...

మార్చి మొదటి వారంలోనే పరీక్షలు ఉంటాయని విద్యాశాఖ ఇదివరకే ప్రకటించింది. నిర్ణీత పరీక్ష ఫీజు చెల్లించాలని అక్టోబర్ 29న ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల నుంచి వసూలు చేసిన రుసుం మొత్తాన్ని బ్యాంకుల్లో చలానా తీసి ఈ నెల 17వ తేదీలోగా ట్రెజరీలో సమర్పించాలని చెప్పింది. విద్యార్థుల పూర్తి వివరాలతో కూడిన పత్రాలను సైతం ఈనెల 24వ తేదీలోగా డిఇఒ కార్యాలయాల్లో అందించాలని పేర్కొంది. అయితే, జిల్లాలోని వసతిగృహాలు, గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రం ప్రభుత్వమే పరీక్ష ఫీజు చెల్లిస్తోంది. ఇక మిగతా ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలలు సహా ప్రయివేటు పాఠశాలల పిల్లలందరూ గడువులోపు పరీక్ష ఫీజు చెల్లించాల్సిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నారు. ఇదే అదనుగా ప్రయివేటు యాజమాన్యాలు ట్యూషన్, టర్మ్, కంప్యూటర్ వంటి అనేక పేర్లతో ఇష్టారీతిన ఫీజులు తీసుకుంటున్నాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి

పదోతరగతి పరీక్ష ఫీజును రెట్టింపు స్థాయిలో వసూలు చేసిన ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పరీక్ష ఫీజు పేరుతో బలవంతంగా బకాయిలన్నీ వసూలు చేస్తున్న వారిని కట్టడి చేయాలి. కరోనా సృష్టించిన ఆర్థిక సంక్షోభం నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న తల్లిదండ్రులు నుంచి విద్యాసంవత్సరానికి చెందిన పూర్తి ఫీజు ఇప్పుడే వసూలు చేయడం సరికాదు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలపై తక్షణం చర్యలు తీసుకోవాలి.

రజనీకాంత్- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

హైదరాబాద్‌లో ఫెనెస్టా నూతన ఫ్యాక్టరీ

హైదరాబాద్ : దేశంలో అతిపెద్ద కిటికీలు, తలుపుల బ్రాండ్ అయినా ఫెనెస్టా తాజాగా హైదరాబాద్‌లో తమ నూతన అల్యూమినియం ఫ్యాక్టరీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లో ఇది తమ సంస్థకు ఏడవ తయారీ ప్లాంట్ అని ఫెనెస్టా బిజినెస్ హెడ్ సాకేత్ జైన్ తెలిపారు. మిగితా ఆరు ప్లాంట్లు, కోట, రెండు బివాడి, చెన్నై, హైదరాబాద్, భువనేశ్వర్‌లో ఉన్నాయన్నారు. సామర్థ్యం విస్తరణలో భాగంగా 7వ యూనిట్‌ను మెద్చల్‌లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

జనవరిలో పాలీ సైంటిఫిక్ ఆయుర్వేదంపై అంతర్జాతీయ సదస్సు

హైదరాబాద్ : పాలీ సైంటిఫిక్ ఆయుర్వేద – ఫ్రీ ఇన్నోవేషన్ టు ఇంపాక్ట్ శీర్షికన తొలి అంతర్జాతీయ సదస్సును ఎస్‌జిపి నిర్వహించబోతుంది. హైదరాబాద్‌లోని ఐఐటి క్యాంపస్‌లో 2023 జనవరి 21, 22 తేదిల్లో ఈ అంతర్జాతీయ సదస్సు జరుగనుంది. దాదాపు 400 మంది పరిశోధకులు, మెడికల్ డాక్టర్లు, ఆయుర్వేద ప్రాక్టీషనర్లు, ప్రభుత్వ అధికారులు, కార్పోరేట్ ప్రతినిధులతో కూడిన డెలిగేట్లు యుఎస్‌ఎ, రష్యా, యుకె, కెనడా, ఇండియా తదితర ఎనిమిది దేశాల వారు పాల్గొననున్నారని ఎస్‌జిపి వ్యవస్థాపకులు, పాలీ సైంటిఫిక్ ఆయుర్వేద (పిఎస్‌ఎ) వ్యవస్థాపకులు డాక్టర్ రవిశంకర్ పోలిశెట్టి తెలిపారు.

అబ్సల్యూట్ బార్బెక్యూస్‌లో సి ఫీస్ట్

హైదరాబాద్ : ఎబిస్‌గా ప్రసిద్ది చెందినటువంటి ప్రముఖ బార్బెక్యూ బఫే రెస్టారెంట్ అయినా అబ్సల్యూట్ బార్బెక్యూస్ విదేశీ సి ఫుడ్‌లో భాగంగా సి ఫీస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రకటించింది. పసందైన సి ఫుడ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న విందు గురువారం నుండి 2022 డిసెంబర్ 4 వరకు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొంది. హైదరాబాద్‌లోని అన్ని ఎబిస్ (అబ్సల్యూట్ బార్బెక్యూస్) శాఖలలో సి ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ప్రత్యేకమైన సీ ఫుడ్ ఫెస్టివల్ అయిన ఈ సీ ఫీస్ట్‌ను ఒక పండగ వాతావరణంతో ఎంతో ఉత్సాహంగా రుచికరంగా పెద్దఎత్తున కస్టమర్లకు అందించడానికి ఎబిస్‌లో ప్రత్యేకమైన ఏర్పాట్లు చేయబడ్డాయని అబ్సల్యూట్ బార్బెక్యూస్, ఎపి అండ్ టిఎస్ టెరిటరీ మేనేజర్, వివేక్ కొలుకుల తెలిపారు.

ఆర్‌టిసిలో సమ్మెపై నిషేధం

- ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఎస్ ఆర్‌టిసిలో ఆరు నెలలపాటు సమ్మెపై నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి రవాణా శాఖ కార్యదర్శి కెఎస్ శ్రీనివాస రాజు జిఒ నెం 43 విడుదల చేశారు. ఈ నెల 21నే జిఒను విడుదల చేసినట్లు ఉత్తర్వులపై ఉన్నప్పటికీ గురువారం అది పబ్లిక్ డొమైన్‌లో కనిపించింది. ప్రజా ప్రయోజనాల దృష్టా ఆర్‌టిసిలో ఆరు నెలలు సమ్మె నిషేధించాలని ఆర్‌టిసి ఎండి అభ్యర్థన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ ఎసెన్షియల్ సర్వీస్ మెయింటెనెన్స్ చట్టం 1971 ప్రకారం, డిసెంబర్ 1 నుంచి ఆరు నెలల పాటు ఆర్టిసిలో సమ్మెపై నిషేధం విధించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జహీరాబాద్ మున్సిపాలిటీలో రెండో రోజూ ఎసిబి దాడులు

- కీలక పత్రాలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లంచం తీసుకుంటూ పట్టుబడిన జహీరాబాద్ మున్సిపల్ కమిషనర్, మేనేజర్, అటెండర్‌ను ఎసిబి అధికారులు సుదీర్ఘంగా విచారించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని మూసానగర్ కాలనీకి చెందిన మహ్మద్ నిసార్ ఇంటి మ్యుటేషన్ చేసేందుకు రూ.రెండు లక్షల లంచం తీసుకుంటూ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, మేనేజర్ మనోహర్ పట్టుబడిన విషయం విదితమే. వారిద్దరితోపాటు అటెండర్ రాకేష్‌ను ఎసిబి అధికారులు 24 గంటలపాటు విచారించారు. రెండో రోజూ మున్సిపాల్టీ కార్యాలయంలో సోదాలు చేశారు. అనుమానాస్పద దస్త్రాలను సీజ్ చేశారు. గురువారం ముగ్గురు నిందితులను ఎసిబి కోర్టులో హాజరు పరిచినట్టు ఎసిబి డిఎస్‌పి ఆనంద్‌కుమార్ తెలిపారు. రిమాండ్‌కు తరలించారు.

ఎఫ్‌ఆర్‌ఒ శ్రీనివాసరావు హత్యను ఖండిస్తున్నాం : స్వామిదాస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎర్రబోడు అటవీ ప్రాంతంలో చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చల్లమల్ల శ్రీనివాసరావు దారుణ హత్యను తెలంగాణ, ఎపి రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ తీవ్రంగా ఖండించింది. అతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం శ్రీనివాసరావు చిత్తశుద్ధితో పనిచేశారనీ, పలు అవార్డులు కూడా పొందారని గుర్తు చేశారు. రాజకీయ నేతల తప్పుడు వాగ్దానాలతో అటవీ అధికారులపై భౌతిక దాడులు జరిగే ప్రమాదం ఉందనీ, అటవీ సంరక్షణ కోసం పటిష్ట చర్యలు తీసుకోవాలని పిసిసిఎఫ్ 2018లోనే రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. అటవీ అధికారుల రక్షణ కోసం మెరుగైన చర్యలు తీసుకోవాలని పాలకులను కోరారు.

మల్లారెడ్డి సంస్థల్లో ముగిసిన ఐటి సోదాలు

- రూ.15 కోట్ల నగదు స్వాధీనం
- ఐటి వర్గాలు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ఆస్తులపై జరిగిన ఆదాయ పన్నుశాఖ సోదాల్లో దాదాపు రూ.15 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఐటి వర్గాలు గురువారం వెల్లడించాయి. 22వ తేదీ ఉదయం మొదలైన ఐటి సోదాలు గురువారం మధ్యాహ్నం ముగిశాయి. రెండున్నర రోజులపాటు కొనసాగిన సోదాల్లో మల్లారెడ్డి వ్యాపార లావాదేవీల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్టు గుర్తించామని ఐటి వర్గాలు తెలిపాయి.

మెడికల్ కళాశాలల్లో ఎంబిబిఎస్, పిజి సీట్ల విషయంలో విద్యార్థుల నుంచి దాదాపు రూ.135 కోట్లు డొనేషన్ల కింద వసూలు చేసినట్టు ఐటిశాఖ తెలిపింది. ఐటీ వర్గాలు వెల్లడించిన ప్రాథమిక సమాచారం మేరకు మెడికల్, డెంటల్, ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలలు, ఆసుపత్రులు, స్థిరాస్తి వ్యాపారం తదితర ఆస్తులపై మల్లారెడ్డి సంస్థలకు చెందిన కార్యాలయాలు, సిఇవోలు, డైరెక్టర్లు, మల్లారెడ్డి కుమారులు, అల్లుడు, బంధువులు, స్నేహితుల ఇళ్లతో పాటు క్రాంతి బ్యాంకు చైర్మన్ ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించారు. సొసైటీ కింద నడుస్తున్న మల్లారెడ్డి విద్యాసంస్థల్లో నిబంధనలు తుంగలో తొక్కి కార్యకలాపాలు నిర్వహించినట్టు ప్రాథమికంగా గుర్తించారు. మల్లారెడ్డికి చెందిన అన్ని కళాశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే ఎక్కువ వసూలు చేసినట్టు ఆధారాలు లభించాయని ఐటి శాఖ వెల్లడించింది. 400 మందికి పైగా ఐటీ సిబ్బంది 65 బృందాలుగా ఏర్పడి.. మల్లారెడ్డి ఆస్తులపై ఐటి సోదాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున అధికారులను ఐటి శాఖ రప్పించింది. మరోవైపు సోదాలు ముగియడంతో ఈనెల 28, 29 తేదీల్లో హాజరై వివరణ ఇవ్వాలని మంత్రి మల్లారెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, బంధువులకు ఐటీశాఖ సమన్లు జారీ చేసింది. పెద్ద సంఖ్యలో సమన్లు ఇవ్వాల్సి ఉండటంతో మరికొందరికి వేరే తేదీల్లో హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న మల్లారెడ్డి

ఢిల్లీ పెద్దల ఒత్తిడితోనే ఐటి దాడులు : మంత్రి మల్లారెడ్డి

ఢిల్లీ పెద్దల ఒత్తిడితోనే ఐటి అధికారులు తమపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఐటీ దాడుల నేపథ్యంలో గురువారం హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని తన నివాసంలో మీడియా సమావేశంలో అల్లుడు రాజశేఖర్ రెడ్డితో కలిసి మంత్రి మాట్లాడారు. రెండ్రోజులపాటు ఐటీ అధికారులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటీ అధికారులు తమ నివాసాలపై, కళాశాలలు, ఇతర సంస్థల్లో సోదాల సందర్భంగా తమను భయభ్రాంతులకు గురిచేశారని చెప్పారు. గతంలో రెండుసార్లు ఐటీ అధికారులు సోదాలు చేశారని, కానీ ఇంత దౌర్జన్యంగా ఎప్పుడూ జరగలేదని, పోలీసు బలగాలతో వచ్చి దాడులు చేయడం విచారకరమని చెప్పారు. అంతా ఆన్‌లైన్ ప్రాసెస్ నడుస్తుందని, తన ఇంట్లో వాళ్లకూ మెడికల్ సీటు ఇవ్వలేమన్నారు. అలాంటప్పుడు అవకతవకలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. తనకు తెలియకుండా పెద్ద కొడుకుతో సంతకాలు పెట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. అధికారులపై ఎక్కడా చేయి చేసుకోలేదని, వారికి పూర్తిగా సహకరించామని చెప్పారు. దొరికిన డబ్బును అధికారులు తీసుకెళ్లారని తెలిపారు. కావాలని దౌర్జన్యం చేసి తమ కుటుంబ సభ్యులను, సిబ్బందిని ఇబ్బంది పెట్టారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంధన సర్‌ఛార్జీల పేరుతో కరెంటు ఛార్జీలను పెంచొద్దు

- ముసాయిదా ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంధన సర్‌ఛార్జీల పేరుతో ప్రతినెలా యూనిట్‌కు 30 పైసల వరకు పెంచి వినియోగదారుల నుంచి వసూలు చేయొద్దని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అందుకనుగుణంగా ఇఆర్‌సి ఇచ్చిన ముసాయిదా ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో పెంచిన విద్యుత్ ఛార్జీలతోనే పేద గృహ వినియోగదారులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అందువల్ల సర్‌ఛార్జీల పేరిట వడ్డనను ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో అమలు కాకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రమాదకరమైన విద్యుత్ సవరణ బిల్లును తెచ్చి, రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతున్నదని విమర్శించారు. ఇందులో భాగంగానే ప్రజలపై విద్యుత్ భారాలను వేస్తోందని తెలిపారు. దొడ్డిదారిన గెజిట్ తెచ్చి ప్రజలపై భారాలు మోపేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నదని పేర్కొన్నారు. కేంద్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ సర్‌ఛార్జీలను ప్రతినెలా పెంచి వినియోగదారుల ద్వారా డిస్కాంలు వసూలు చేసుకోవాలంటూ ఇఆర్‌సిల మీద ఒత్తిడి పెంచుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతూ వినియోగదారులపై భారాలు వేయడానికి పూనుకుంటున్నదని తెలిపారు. అందువల్ల ఇఆర్‌సి జారీచేసిన ముసాయిదా ఉత్తర్వులను వెనక్కి తీసుకునే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, ప్రజలపై భారాలు పడకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.



దీన జనులకు సేవ చేయుటమే దైవత్వం

ప్రజాశక్తి - కల్చరల్ (హైదరాబాద్)

ఆర్తులకు, దీన జనులకు సహాయ పడి సామాజిక సేవ చెయటమే దైవత్వం అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ నగేష్ బీమపాక అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డాక్టర్ బి డిబ్బల రావు సహకారంతో సత్య సాయి బాబా 97వ జయంతి నిర్వహించారు. ఈ నేపథ్యంలో మధుర గాయకుడు శరత్ చంద్రచే సత్య సాయి పద్యమాల ఘంటసాల స్వర హేళ సంగీత కార్యక్రమం జరిగింది. సనాతన సారధి పత్రిక నుంచి 18 పద్యాలను ఘంటసాల సాయిపై రాసి పాడిన భక్తి గీతాలను శరత్ చంద్ర, శివ రమ్య, లక్ష్మీ రామలు మధురం గానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ నగేష్ ప్రముఖ రచయిత్రి డాక్టర్ కెవి కృష్ణకుమారితో కలసి ధరణి థియేటర్ ఛానల్ ప్రారంభించి సాయి సేవ కార్యక్రమాలు వివరించారు.

ఈ కార్యక్రమంలో జగదీస్వర్, రాంబాబు, విదేశీ ఆంధ్రుడు దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు. సౌజన్య దాతలు వీరరాజు దంపతులకు సత్కారం చేశారు.

బీహార్‌లో డిఎస్‌ఎంఎం జాతీయ మహాసభ

- రాజ్యాంగం రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ఉద్యమం
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ రక్షణ, రిజర్వేషన్ల అమలు ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ నినాదాలే ప్రాతిపదికగా బీహార్ రాష్ట్రంలోని బెగుసరాయి పట్టణంలో దళిత శోషన్ ముక్తి మంచ్ (డిఎస్‌ఎంఎం) జాతీయ మూడో మహాసభలు జరుగనున్నాయని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సంఘం రాష్ట్ర నాయకులతో కలిసి సంబంధిత కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కెవిపిఎస్ సహాయ కార్యదర్శి కోట గోపి అధ్యక్షతన రాష్ట్ర సమావేశం నిర్వహించినట్టు తెలిపారు.



ఎనిమిదేండ్ల బిజెపి పాలనలో దళితులపై 300 రెట్లు దాడులు పెరిగాయని తెలిపారు. ఆ పార్టీ రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్రలు చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ వల్ల సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తోందని విమర్శించారు. మహాసభలో రాష్ట్రం నుంచి 23 మంది ప్రతినిధులుగా పాల్గొంటున్నట్టు ఆయన తెలిపారు.

బిసిల రిజర్వేషన్లు 50 శాతానికి పెంచాలి

- రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి జనగణన చేపట్టి, జనాభా దామాషా ప్రకారం వారికి 50 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ రిజర్వేషన్లనూ పెరిగిన జనాభాకనుగుణంగా పెంచాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మహా ఉద్యమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రజాస్వామిక వాదులు, ప్రజా సంఘాలు, విద్యార్థి, కుల సంఘాల నాయకులు, మేధావులు, ప్రొఫెసర్లు తమ వెంట నడవాలని పిలుపునిచ్చారు. 1932 తర్వాత ఇప్పటి వరకు బిసి కులగణన ఎందుకు చేయలేదో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. బిసి కులగణన చేయాలనీ, దేశంలోని ఉన్నత న్యాయస్థానాల్లోనూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసి క్రీమీలేయర్ విధానం ఎత్తివేయాలన్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లలో ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు వాటా కల్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా కేంద్ర విశ్వవిద్యాలయాల్లో బిసిల కోసం 8,617 టీచింగ్ పోస్టుల భర్తీకి అనుమతి ఉన్నా.. ఉద్దేశపూర్వకంగా 4,821 పోస్టులను ఖాళీగా ఉంచారని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి బిసిల పట్ల చిత్తశుద్ధి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దయానందరావు, రాష్ట్ర మైనారిటీ కన్వీనర్ అబ్రార్, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ ముదిరాజ్, పార్టీ అధికార ప్రతినిధులు సాంబశివ గౌడ్, అరుణ క్వీన్, డా వెంకటేష్ చౌహాన్ పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలు చేయాల్సిందే..

- ఆర్‌టిసిలో యూనియన్లను అనుమతించాలి : ఆర్‌టిసి జెఎసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మికులకు వెంటనే వేతన ఒప్పందాన్ని అమలు చేయాలని ఆర్‌టిసి జెఎసి డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్ లోని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జెఎసి చైర్మన్ కె.రాజిరెడ్డి, వైస్‌చైర్మన్ హన్మంతు ముదిరాజ్, కో–కన్వీనర్లు జి.అబ్రహం, సుద్దాల సురేశ్, జెఎసి నేతలు ఎవి.రావు, కె.గీత, జీఆర్.రెడ్డి, తదితరులు మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో వేతన ఒప్పందంపై తమకు కాస్త గడువు కావాలని అడిగిన రాష్ట్ర ప్రభుత్వం.. ప్రస్తుతం స్పష్టత ఇవ్వకుండా గమ్మునుగా ఉండడం సరికాదన్నారు. ప్రభుత్వం సైలెంట్‌గా ఉంటే కార్మికులు తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆర్‌టిసి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో సమానంగా ఉండేలాగా ఫిట్‌మెంట్ ప్రకటించి 2017 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలనీ, 31.1 శాతం డిఎను మెర్జ్ చేసి మాస్టర్ పేస్కేలు ఇవ్వాలని కోరారు. ఆర్‌టిసి కార్మికోద్యమంపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసి కార్మిక సంఘాల కార్యక్రమాలను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. వెల్ఫేర్‌బోర్డులను రద్దు చేసి చట్ట ప్రకారం ఆర్‌టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2013 వేతన ఒప్పంద బకాయి బాండ్లను వెంటనే చెల్లించాలని కోరారు. సిసిఎస్‌కు తక్షణమే ఎన్నికలు నిర్వహించేలా యాజమాన్యం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిసిఎస్‌కు బకాయిపడ్డ రూ.900 కోట్లను ఇవ్వాలనీ, రికవరీలను ప్రతి నెలా చెల్లించాలని డిమాండ్ చేశారు. సిబ్బందిపై పనిభారం, వేధింపులు తగ్గించాలని కోరారు. సంస్థలో వేధింపుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌టిసి కార్మికుల పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


సమీక్షా సమావేశాల్లో పాల్గొన్న మాగిజైన్ ప్రతినిధులు

బ్యాంక్ ప్రేరణగా 'యూనియన్ ధారా'

- యుబిఐ ఇడి రజ్నీష్ కర్నటక్

హైదరాబాద్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) మాగజైన్ అయినా 'యూనియన్ ధారా'పై హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో రెండు రోజుల సమీక్షా సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. మాగిజైన్ టాప్ ప్రతినిధులు హాజరైన ఈ సమావేశం ప్రారంభోత్సవంలో ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రజ్నీష్ కర్నటక్ మాట్లాడుతూ యూనియన్ ధారా బ్యాంక్‌కు ఊపిరిగా, ప్రేరణగా ఉండాలని సూచించారు. దేశంలో మరింత గొప్ప మాగజైన్‌గా నిలిచేలా ప్రతినిధులు ప్రయత్నించాలని ఆయన సూచించారు. ఫీల్డ్ జనరల్ మేనేజర్ సురేష్ చంద్ర మాట్లాడుతూ.. యూనియన్ ధారా ఉద్యోగుల్లో నైపుణ్యం, క్రియేటివిటీ పెంచేలా ఉండాలన్నారు. తమ మాగజైన్‌కు జాతీయ స్థాయిలో అనేక అవార్డులు వచ్చాయయని యూనియన్ ధారా ఎడిటర్ డాక్టర్ సులభ కోరె తెలిపారు.

నిందితుల కస్టడీకి ఎసిబి కోర్టు నో

- పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ముగ్గురి నిందితుల కస్టడీ పిటిషన్‌ను అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) ప్రత్యేక కోర్టు కొట్టివేసింది. ముగ్గురు నిందితులను ఇదివరకే రెండు రోజుల కస్టడీకి అనుమతించామని.. మరోసారి కస్టడీకి ఇవ్వడం కుదరని సిట్ అధికారులకు గురువారం తేల్చి చెప్పింది. ఈ కేసుకు సంబంధించి విచారణ జరిపి మరింత సమాచారం తెలుసుకోవడానికి సిట్ అధికారులకు ఇంతకుముందే రెండు రోజుల అనుమతిచ్చింది. ఈ నెల 10, 11 తేదీల్లో ముగ్గురి నిందితులను కస్టడీలోకి తీసుకొన్న సిట్ అధికారులు పలు విషయాలపై ప్రశ్నించారు. ఇందులో భాగంగా కొంత సమాచారం సేకరించారు. ఆ సమాచారం సరిపోదని దర్యాప్తులో భాగంగా కొన్ని ముఖ్య విషయాలు వెల్లడయ్యాయని, వాటికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోవాలని, మరో ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఎమ్మెల్యేలకు ఎర కేసు వ్యవహారంలో నిందితులు డబ్బు ఎక్కడ నుంచి సమీకరించాలనుకున్నారు? సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, ఇతరత్రా ఎలక్ట్రానిక్స్ పరికరాలు స్వాధీనం చేసుకుని.. వాటిలోంచి కొంత సమాచారాన్ని సిట్ అధికారులు సేకరించారు. ఈ సమాచారానికి సంబంధించి ముగ్గురు నిందితులను ప్రశ్నించాల్సి ఉందని సిట్ అధికారులు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే రెండు రోజుల కస్టడీలోకి తీసుకొని ప్రశ్నించారని నిందితుల తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. ఈ కేసులో పెట్టిన సెక్షన్లు పూర్తిగా తప్పని.. కేవలం రాజకీయ కారణాలతోనే నిందితులపైన కేసులు నమోదు చేశారని తెలిపారు. వీరిని అనవసరంగా 25రోజులకు పైగా చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉంచారని.. కస్టడీకి మరోసారి అనుమతించొద్దని న్యాయస్థానాన్ని కోరారు. ఈ వాదనలకు ఏకీభవించిన ఎసిబి ప్రత్యేక కోర్టు.. నిందితులను కస్టడీకి ఇవ్వడానికి నిరాకరించింది.



మార్చి కల్లా ఉద్యోగుల రెట్టింపు

- మూడు కొత్త సేవల ఆవిష్కరణ
- ఆన్‌పాసివ్ వెల్లడి

హైదరాబాద్ : దుబాయ్ కేంద్రంగా పని చేస్తున్న బిజినెస్ అటోమేషన్ సొల్యూషన్స్, ఇంటిలిజెన్సీ సేవలను అందించే ఆన్‌పాసివ్ తన హైదరాబాద్ కేంద్రాన్ని విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇక్కడి సెంటర్‌లో ప్రస్తుతం 500 పైగా ఉద్యోగులు పని చేస్తున్నారని.. వచ్చే ఏడాది మార్చి ముగింపు నాటికి సిబ్బందిని 1000కి పైగా చేర్చనున్నట్లు ఆన్‌పాసివ్ చీఫ్ కార్పొరేట్ కమ్యూనికేషన్ ఆఫీసర్ సోహా ఇమామ్ తెలిపారు. గురువారం నగరంలోని ఆ సంస్థ కార్యాలయంలో ఆన్‌పాసివ్ డైరెక్టర్ వెంకట కిల్లి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మహ్మద్ కమల్‌తో కలిసి ఒ–నెట్, ఒ–మెయిల్, ఒ–కనెక్ట్ సేవలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోహా మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా తమ మొదటి సెట్ విప్లవాత్మక పరిష్కారాలను అందిస్తాయన్నారు. భూమి మీద నివసించే ప్రతి ఒక్కరికీ సమర్థవంతమైన, ప్రభావవంతమైన కమ్యూనికేషన్స్ కోసం ఈ మూడు సేవలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. నూతన, ఆత్యాధునిక, అత్యంత అనుకూలమైన సాంకేతికతతో డిజిటల్ రంగానికి పునరాకతి కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.

అమ్మకానికి ఆస్తులను గుర్తించండి

- మంత్రులకు కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరుల ఆస్తులను ప్రయివేటు శక్తులకు విక్రయించడానికి కేంద్రం ప్రణాళికలు వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2022–23)గాను ఆస్తుల నగదీకరణ (మానిటైజేషన్)కు నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరడానికి గాను ప్రయత్నాలు వేగవంతం చేయాలని ఆయా మంత్రిత్వ శాఖలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసినట్లు గురువారం రిపోర్టులు వచ్చాయి. 2022–23లో రూ.1,62,422 కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తులను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటి వరకు రూ.33,422 కోట్ల ఆస్తులను విక్రయించింది. ఇందులో బొగ్గు శాఖలోని రూ.17,000 కోట్ల విలువ చేసే ఆస్తులను ప్రయివేటుకు కట్టబెట్టింది. నగదీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని తాజాగా ఆర్థిక మంత్రిత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేసిందని సమాచారం.

బ్రిటన్ సుప్రీంకోర్టుకు నీరవ్ మోడీ

లండన్ : భారత బ్యాంక్‌లను వేల కోట్లకు మోసం చేసి లండన్ పారిపోయిన వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ తనను భారత్‌కు అప్పగించొద్దని బ్రిటన్ సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిపారు. ఇందుకు అనుమతివ్వాలని లండన్ హైకోర్టుకు అప్పీల్ చేసుకున్నారు. నీరవ్ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.11వేల కోట్ల మేర మోసం చేసిన విషయం తెలిసిందే. నీరవ్‌ను భారత్‌కు అప్పగించొచ్చని ఇటీవల అక్కడి హైకోర్టు తీర్పు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు పేర్కొన్నారు. తన మానసిక అనారోగ్యం దృష్టా తనను భారత్‌కు అప్పగించొద్దంటూ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి కూడా ప్రతికూల తీర్పు వస్తే.. యూరోపియన్ కోర్టు ఆఫ్ హ్యూమన్ రైట్స్‌ను ఆశ్రయించడానికి వీలుందని తెలుస్తోంది.

భారత్‌లో అమెజాన్ లెర్నింగ్ ఫ్లాట్‌ఫాం మూత

న్యూఢిల్లీ : భారత్‌లోని అమెజాన్ లెర్నింగ్ ఫ్లాట్‌ఫాంను మూసివేస్తున్నామని దిగ్గజ ఇ–కామర్స్ సంస్థ అమెజాన్ గురువారం ప్రకటించింది. ఎలాంటి కారణం చూపకుండానే ఈ నిర్ణయం ప్రకటించడం గమనార్హం. కరోనా కాలంలో ఆన్‌లైన్ లెర్నింగ్‌కు డిమాండ్ పెరగడంతో గతేడాది ప్రారంభంలోనే ఈ వేదికను ప్రారంభించింది. జెఇఇ వంటి పోటీ పరీక్షలకు కోచింగ్‌ను అందిస్తోంది. కాగా.. ప్రస్తుత వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని దశల వారిగా దీనిని అమలు చేయనున్నట్లు పేర్కొంది. కాగా ఇందులో ఎంత మంది ఉద్యోగులు పని చేస్తున్న విషయాన్ని ఆ సంస్థ వెల్లడించలేదు. ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా 10వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు అమెజాన్ ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.